ప్రజాశక్తి
సోమవారం 20 జనవరి 2025

కదిరిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు

# రాళ్ల గుట్టలు, ఇరిగేషన్ భూములు మాయం...

- బడా బాబులకు కొమ్ముకాస్తున్న అధికారులు
- ప్రభుత్వ భూముల్లో భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోని వైనం
- రోడ్డుపక్కన బంకులు వేసుకున్న వారిపై ప్రతాపం

**బడా బాబులు తలుచుకుంటే ఏమైనా చేయగలరు, రెవిన్యూ అధికారులు తలచుకుంటే రాళ్ళ గుట్టలు సైతం సాధారణ భూములుగా మారుతాయి. ఇదే పరిస్థితి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రభుత్వ భూములకు వర్తించింది. ప్రభుత్వ భూములకు రక్షణగా నిల్వవలసిన రెవెన్యూ అధికారులే భూ బకాసులలకు కొమ్ముకాస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.**

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

పుట్టపర్తిలో ఇరిగేషన్ భూములే కాదు రాళ్ల గుట్టలు కూడా మాయమవుతున్నాయి. 2024 ముందు రెవెన్యూ రికార్డుల్లో రాళ్ల గుట్టలు, ఇరిగేషన్ భూములుగా ఉన్న ప్రభుత్వభూములు 2025 కి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం రెవిన్యూ రికార్డులు తనిఖీ చేస్తే ఆన్లైన్లో పలు ప్రముఖుల పేర్లతో 1బి కనిపిస్తోంది. ఇది ఎవరి తప్పిదం? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓ ప్రైవేట్ విద్యాసంస్థ అధినేత పేరిట 2.45 ఎకరాలే కాకుండా మరో 0.77 ఎకరాల రాళ్లగుట్ట సైతం ఆయన పేరిట 1బి ఆన్లైన్లో కనిపిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ రాళ్లగుట్టలకు రెవెన్యూ అధికారులు ఎప్పటినుంచి 1బిలు ఇష్యూ చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేదలు ఇల్లు నిర్మించుకోవడానికి భూములు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు రెవిన్యూ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా పట్టించుకోవటం లేదు. అయితే ఆ ప్రయివేటు విద్యాసంస్థ అధినేతకు ఎకరాలు మీద ఎకరాలు భూములు చేయిస్తున్నారు. ఎనుములపల్లిలో పేదలు సాగు చేసుకుంటున్న భూమిని రైతులకు తెలియకుండా రహదారిగా మార్చేశారు. ఇలా పేదలకు తెలియకుండా రెవిన్యూ రికార్డులు మార్చేయడం దారుణమని రైతులు వాపోతున్నారు. అదేవిధంగా పుట్టపర్తిలోని పశు వైద్యశాల పక్కన ఉన్న ఇరిగేషన్ భూమిలో కొందరు పేదలు పొట్టకూటి కోసం కొన్ని బంకులు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం చిరు వ్యాపారం చేసుకుంటూ కూలి డబ్బులు సంపాదించుకుంటున్న పేదలపై ఇరిగేషన్ మున్సిపల్ అధికారులు తమ ప్రతాపం చూపిస్తున్నారు. వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. బడా బాబులు ఇరిగేషన్ భూముల్లో భవంతులు నిర్మిస్తున్నా, 1బిలు చేయించుకుంటున్నా ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఎక్కడి న్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొట్టకూటి కోసం జీవనం సాగిస్తున్న తమపై వేధింపులు ఆపి, ఇరిగేషన్ భూముల్లో భవంతుని నిర్మించిన వారిపై చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

### పొట్ట కొట్టొద్దు

5 సంవత్సరాల నుంచి టీస్టాల్ నడుపుకుంటున్నాను. మా పిల్లలను దీని ద్వారానే పోషించుకోగలుగుతున్నాను. ఇప్పుడు ఉన్నట్టుండి ఇరిగేషన్ భూమిలో ఉన్న టీస్టాల్ ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం దారుణం. ఉన్న ఈ ఉపాధి పోతే కుటుంబం రోడ్డున పడుతుంది. కలెక్టర్ స్పందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

**రవి, బాధితుడు**
**హోటల్ యజమాని, పుట్టపర్తి**

### కుటుంబం రోడ్డున పడుతుంది

10 సంవత్సరాల నుంచి ఇరిగేషన్ భూమిలో చిన్న హోటల్ పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాను. హోటల్లో నేను, నా భార్య రోజంతా పనిచేస్తే దిన కూలి గిట్టుబాటు అవుతుంది. ఇప్పుడు ఉన్నట్టుండి మున్సిపల్ అధికారులు హోటల్ తొలగించమని చెప్పడంతో రోడ్డున పడాల్సివస్తుంది. అధికారులు మాపై దయ ఉంచి హోటల్ ఖాళీ చేయకుండా చేయండి.

**నాగమణి,**
**టీ స్టాల్ నిర్వాహకులు, పుట్టపర్తి**

### న్యాయం చేయండి

ఇరిగేషన్ భూమిలో బంకును వేసుకున్నది వాస్తవమే. కానీ రోడ్డులో ఎవరికి కూడా ఇబ్బంది కలిగించకుండా మా పనులు చేసుకుంటున్నాం. రోజు కూలి సంపాదించుకుంటూ ఇక్కడ పని చేసుకుంటున్నాను. కానీ ఇప్పుడు ఉన్నట్టుండి ఖాళీ చేయమని చెప్పడంతో దిక్కుతోచలేదు. ఉన్న ఉపాధి పోతే మా కుటుంబం రోడ్డున పడుతుంది. అధికారులు మాకు న్యాయం చేయాలి.

**షరీఫ్,**
**ఏసీ మెకానిక్, పుట్టపర్తి**

### ఆదుకోండి

కరోనా సమయంలో రోగులకు ఆహారాన్ని మా హోటల్ నుంచి సరఫరా చేసాం. కానీ ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. దీంతో అప్పులు ఎక్కువై బాడుగలు చెల్లించలేక ఉన్న హోటల్ సైతం అమ్ముకున్నాము. ఇప్పుడు ఇక్కడ చిన్న హోటల్ ఏర్పాటు చేసుకుంటే ఉన్నట్లుండి ఖాళీ చేయమని చెప్పడంతో రోడ్డున పడ్డాము. కలెక్టర్ స్పందించి మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాను.

**సత్యవతి,**
**హోటల్ నిర్వాహకులు, పుట్టపర్తి**

# అమిత్‌షా గోబ్యాక్

**ప్రజాశక్తి - పుట్టపర్తి**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో నాయకులు ఆదివారం నిరసనలు చేశారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, రొద్దం తదితర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. కదిరిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

# స్థావరాలు బంద్.?

## ఉన్నతాధికారుల హెచ్చరికలతో పేకాటకు బ్రేక్
## కొత్త మార్గాలకై వెతుకులాట

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

జిల్లాలో జూద స్థావరాలపై పోలీసు శాఖ నిఘా పెంచింది.ఇప్పటి వరకు వ్యవస్థీకృతంగా సాగుతూ వచ్చిన జూద స్థావరాలపై నిఘా పెట్టడమే కాకుండా నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేసినట్టు తెలుస్తోంది. దీంతో తాత్కాలికంగా ఈ జూద క్షేత్రాలకు ఫుల్‌స్టాప్ పడింది. అయితే ఇది ఎంతకాలం కొనసాగుతుందన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే ఈ క్షేత్రాల వెనుక ముఖ్యమైన నేతల ప్రమేయం కూడా ఉందన్న ఆరోపణలున్నాయి. వారి అండదండలతోనే చాలకాలంగా జూదక్షేత్రాలు పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలో సాగుతూ వచ్చాయన్న ప్రచారం నడుస్తోంది. అయితే దీనిపై ఇటీవల సీరియస్‌గా దృష్టి సారించినట్టు సమాచారం.అంతేకాకుండా నిర్వాహకులకే కాకుండా ముఖ్య నేతలకు కూడా హెచ్చరికలు చేయడంతో వీటిని మూసేసుకున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు వీటి నిర్వహణకు కొత్త మార్గాల కోసం నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్లు సమాచారం.

**రూ. కోట్లలో సాగిన క్షేత్రాలు**

మొన్నటి వరకు ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రధానంగా జూద క్షేత్రాలు పెద్దఎత్తున నడిచాయి. ఒక్కో క్షేత్రంలో రోజుకు మూడు కోట్ల రూపాయల వరకు కూడా లావాదేవీలు సాగినట్లు తెలుస్తోంది. అవి కూడా ఒక పకడ్బందీ ప్రకారం నడుస్తూ వచ్చాయి. జూదరలు జూద క్షేత్రానికి రావడానికి అవసరమైన రవాణ సౌకర్యాన్ని నిర్వాహకులే ఏర్పాటు చేసేవారు. వారికి భోజన సౌకర్యం కూడా ఏర్పాటై ఉండేది. జూద క్షేత్రాలకు తరలించేందుకు పదుల సంఖ్యలో వాహనాలు ఏర్పాటై ఉండేవి. ఉదయం వాహనంలో జూదరులను తరలించడం, సాయంత్రం వారి ప్రాంతానికి చేర్చే వరకు ఏర్పాట్లు చేయబడి ఉండేవి. ఈ రకంగా వాహన యజమానులకు ఉపాధి ఉండేది. ఈ రకంగా ఉమ్మడి జిల్లాలో నాలుగైదు నియోజకవర్గాల్లో ఈ వ్యాపారం మూడు పువ్వులు...ఆరు కాయలుగా సాగుతూ వచ్చింది.

**హెచ్చరికలతో తాత్కాలిక బ్రేక్**

ఈ జూద క్షేత్రాలను గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. ఇదే సమయంలో డ్రోన్ల ద్వారా కూడా ఎక్కడ జూద క్షేత్రాలు నడుస్తున్నాయన్నది గుర్తించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. గుర్తించిన ప్రాంతాల్లో ముఖ్య నేతలకు ఉన్నతాధికారి ఒకరు ఇక ఆట బంద్ చేసుకోవాలని సూచించినట్టు తెలుస్తోంది. చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సుతిమెత్తగా హెచ్చరించినట్టు సమాచారం. దీంతో ఆటను తాత్కాలికంగా అయితే బంద్ చేసుకున్నారు. అధికారం వచ్చిన సమయంలో వచ్చే ఆదాయానికి గండిపెట్టినట్టయిందన్న అసంతృప్తి కూడా ముఖ్య నేతల్లోనున్నట్టు తెలుస్తోంది. అయితే కొత్త మార్గాల్లో దీన్ని కొనసాగిస్తారా లేక శాశ్వతంగా బంద్ చేసుకుంటారా అన్నది చూడాల్సి ఉంది.

# ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలోని టిటిడి కళ్యాణ మంటపంలో సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఎం ఎస్ రామయ్య, డాక్టర్ ఎంఆర్ జయరాం స్వామిల సౌజన్యంతో ఎంఎస్ రామయ్య అసుపత్రి వైద్యుల బృందంచే ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తి గత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు దాదాపు 700 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ కార్యదర్శి బాలాజి, టిడిపి పట్టణ అధ్యక్షులు డీఈ రమేష్ కుమార్, జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, సద్గురు శ్రీ యోగి నారాయణ సేవాసమితి ప్రెసిడెంట్ రవిశంకర్, రాజ్యలక్ష్మి మోహన్, మహేష్, చంద్రమోహన్, వెంకటేష్‌తో పాటు ఎంఎస్ రామయ్య అసుపత్రి వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేమన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ టిఎస్. చేతన్

# మునిమడుగు ఘటనలో 20 మందిపై కేసు

## 11 మంది అరెస్టు
## అనంతపురం జిల్లా జైలుకు తరలింపు

**ప్రజాశక్తి-పెనుకొండ**

పెనుకొండ మండలం మునిమడుగు గ్రామంలో ఓ మహిళ జుట్టును కత్తిరించిన సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కియా పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేసి 11 మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మిగిలిన 9 మంది కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రాఘవన్ వెల్లడించారు. అందుకు సంబంధించిన వివరాలు...మునిమడుగు గ్రామానికి చెందిన ఓ యువతి తప్పిపోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రెండు రోజుల వ్యవధిలోనే అమ్మాయిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనలో మైనర్ అమ్మాయికి మాయ మాటలు చెప్పి వెంట తీసుకెళ్లారని అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో యువకుడు పై ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రేమ జంట పారిపోవడానికి మహిళ కారణమని కేసులో ఎక్కడ ఆమెపై ఫిర్యాదు చేయలేదు. కేవలం అనుమానంతో బాలిక కుటుంబ సభ్యులైన మహిళలు ఆమెపై దాడి చేసి జడ కత్తిరించారు. పెనుగులాటలో బట్టలు చిరిగిపోయాయి. ఈ సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో సిఐ మునిమడుగు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. వెంకటలక్ష్మి పై దాడికి పాల్పడిన కేసులో 20 మంది పై కేసు నమోదు చేశారు. 11 మందిని అరెస్టు చేసి అనంతపురం సబ్ జైలుకు తరలించారు. పరారీలో ఉన్న మిగిలిన 9 మందిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు.

# ప్రజా కవి వేమన

## కలెక్టర్ టిఎస్. చేతన్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

సామాజిక చైతన్యం కోసం పాటుపడిన ప్రజాకవి వేమన అని కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్లో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్,డిఆర్వో విజయసారథి, జిల్లా టూరిజం ప్రతినిధి ప్రతాపరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను తన పద్య రూపంలో రచించిన వేమన ప్రజాకవిగా గుర్తింపు పొందారన్నారు. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట విననివారు ఎవరు ఉండరన్నారు. ఆయన 17వ శతాబ్దంలో పద్యాలు రచించినప్పటికీ నేటికీ కూడా ఆ పద్యాలు సామాన్య ప్రజానీకం చెప్పుకునే విధంగా ఉన్నాయన్నారు. మానవుని హీనస్థితికి కారణమైన వ్యవస్థపై తిరుగుబాటు చేసిన మహనీయుడు అన్నారు. ఆయన గుంటూరు జిల్లా కొండవీడులో జన్మించినప్పటికీ శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం కటారుపల్లిలో జీవ సమాధి అయ్యారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సమాధి వద్ద అఖండ జ్యోతిని వెలుగుతోందన్నారు. వేమన పద్యాల సందేశాలను నేటి యువతతో పాటు భావితరాలకు అందించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 22న అనంతలో 'డాకు మహారాజ్' విజయోత్సవ సభ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం వేదికగా సినీ హీరో నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ చిత్ర విజయోత్సవ సభను ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు. ఆదివారం బాలకష్ణ అభిమాన సంఘాలతో కలిసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు గౌస్‌మోద్దీన్, ఎన్‌బికె హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మూర్ఛ వైద్య శిబిరం

**ప్రజాశక్తి-హిందూపురం**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో 127 ఉచిత మూర్ఛ వ్యాధి వైద్య శిబిరాన్ని డాక్టర్ ఈటి రామ్మూర్తి నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 127 మంది రోగులకు పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు రామ్మూర్తి మాట్లాడుతు మూర్ఛ వ్యాధి పై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాధిగ్రస్తులు మందులు ఉపయోగిస్తే వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రామకృష్ణ, నాగేంద్రాచారి, ప్రభాకర్, గంగిరెడ్డి, నారాయణ స్వామి, ఉగ్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు రామ్మూర్తి

రోగులకు సహాయం అందిస్తున్న, జెవివి నాయకులు

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

## జిల్లా పంచాయతీ అధికారి సమత

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

పంచాయతీలలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడతామని అందుకోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి సమత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

**ప్రశ్న : సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ ఏ విధంగా ఉంది?**

**జవాబు :** జిల్లా వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు 421 ఉన్నాయి. కార్మికులు గ్రామంలో సేకరించిన తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి , వాటిలో వానపాములను వదిలి ఎరువుగా తయారు చేసి ఆ ఎరువును రైతులకు కిలో 40 రూపాయలు చొప్పున అమ్మి దాని ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడతారు. పంచాయతీలలో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం, వీధులను శుభ్రం చేయడం వల్ల పంచాయతీ పరిశుభ్రంగా ఉండటమే కాక , చెత్త ద్వారా సేకరించిన ప్లాస్టిక్ బాటిల్ ,ఇనుము ముక్కలు, సిల్వర్ ,తదితర వస్తువుల ద్వారా పంచాయతీలకు కొంత ఆదాయం లభిస్తుంది. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నాం. పంచాయతీలలో, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ వాడకం నిషేధం పై ప్రజలకు అవగాహన కల్పించి అమలు జరిగే విధంగా చర్యలు చేపడతాం.

**ప్ర : ఇటీవల పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. వాటి ద్వారా ఏయే పనులు నిర్వహిస్తున్నారు?**

**జ:** శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రధాన ద్వారం నుంచి మామిళ్ళకుంట వరకు, ప్రశాంతి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక

పారిశుధ్య పనులు చేపట్టాము. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, నివాస ప్రాంతాలు, మునిసిపాలిటీలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లో శుభ్రపరిచే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నాం. రహదారులు వెంబడి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి, తాగునీటి వసతి వంటి పనులను చేపట్టాము. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో సిసి రోడ్లు నిర్మాణానికి వచ్చిన నిధులకు సరిపడా సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులు పూర్తి అయ్యాయి.

**ప్ర : పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ 5 ఉద్యోగుల వేతనాల సమస్యలపై మీ సమాధానం?**

**జ:** పంచాయతీ సెక్రటరీల గ్రేడ్ 5 ఉద్యోగుల శాలరీ కొంతకాలం నుండి సమస్య నెలకొంది. ఎక్కడైతే కాళీ ఉంటే వాటిని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి, అనంతపురం జిల్లా కేంద్రానికి వాటి సమాచారం పంపడం జరిగింది. వీరి శాలరీ సమస్య రెండు మూడు నెలల్లో పరిష్కారం అవుతుంది.

**ప్ర : జిల్లావ్యాప్తంగా పంచాయతీల్లో ఏయే అభివద్ధి పనులు చేపడుతున్నారు, ఎంత నిధులు మంజూరు అయ్యాయి?**

**జ:** శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, గ్రామంలో తాగునీటి సమస్య, వీధిలైట్లు ఏర్పాటు రోడ్ల మరమ్మతులకు మొదటి ప్రాధాన్యత నిస్తున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పంచాయతీలకు 2024 -25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక నిధుల క్రింద జిల్లాకు రూ.31.5 కోట్లు నిధులు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పంచాయతీల ఖాతాల్లోకి జమ కావడం జరిగింది. ఈ నిధుల ద్వారా పంచాయతీలలో అభివృద్ధి పనులను సక్రమంగా జరిగే విధంగా డిపిఒలకు, ఈవోఆర్డీలకు సూచనలు ఇచ్చాం.

# అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కించపరిచేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వ వైఖరి ఏంటో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా వివరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం సిపిఎం నాయకులు ఎస్‌హెచ్.బాషా, జిల్లా రైతు సంఘం నాయకులు మారుతి, సిఐటియు నాయకులు జెవి.రమణ ఆధ్వర్యంలో పట్టణంలోని కళాజ్యోతి కూడలిలో అంబేద్కర్ విగ్రహం ముందు పార్టీ శ్రేణులతో కలిసి 'గో బ్యాక్ అమిత్ షా' అని నినాదాలు చేశారు. అమిత్‌షాను కేంద్ర హోం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్ షా వ్యాఖ్యలపై బిజెపి వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోవడం దుర్మార్గమని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం కూడా తమ వైఖరి తెలుపకుండా రాష్ట్రానికి అమిత్ షాను ఆహ్వానించ డాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. దీనిని బట్టి కూటమి పార్టీలు, నాయకులు రాజ్యాంగం, అంబేద్కర్ పట్ల ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. అమిత్ షా దేశ పౌరులందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిచో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత నాయకులు నారాయణస్వామి, వెంకటనారాయణ, రమణ, వెంకటస్వామి, హరి, సిఐటియు కార్యదర్శి ఎల్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**అమిత్ షా దిష్టిబొమ్మ దహనం**

ధర్మవరంలో అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

**కదిరి టౌన్ :** అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. నాయకులు బాబ్జాన్, జగన్మోహన్, లియాకత్ మాట్లాడుతూ అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇక విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని చెప్పిన కేంద్రం ప్రయివేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్లు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలి, ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామ్మోహన్, ముస్తాక్, సిపిఐ నాయకులు పవన్‌కుమార్, మధునాయక్, నారాయణప్ప, ఫాజిల్ పాల్గొన్నారు.

**రొద్దం :** అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జిఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. స్థానిక రొద్దకంపల్లి ఆలయ ఆవరణలో సిపిఎం మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎంపి వెంకటేష్, సభ్యులుగా రుద్రప్ప, అనిల్, గిరిజమ్మ, జలాన్‌బాషాలను ఎన్నుకున్నారు. నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో హరీష్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రొద్దంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జిఎల్.నరసింహులు

# ఘనంగా యోగి వేమన జయంతి

**ప్రజాశక్తి-పెనుకొండ**

యోగి వేమన జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్‌లో ఉన్న వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన సమాజోద్ధరణకు సులువైన పదాలతో ఆటవెలది పద్యాలను రచించి ప్రజలను జాగృతి చేయడానికి ప్రయత్నించాడని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చరణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, మారుతిరెడ్డి, కృష్ణారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేమన పద్యాలు, ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. వేమన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నారాయణస్వామి ఆధ్వర్యంలో ఉద్యోగులు వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేమన శతకాలను వినిపించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ప్రసాద్, వినయ్, శేఖర్, కూటమి నాయకులు తుమ్మల మనోహర్, బ్రాహ్మణపల్లి నాయుడు, మల్లెల నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది యోగివేమన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో యోగివేమన సేవలను కొనియాడారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సాయి మనోహర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది వేమన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో అబ్దుల్‌నబి, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లను డ్రోన్‌తో పర్యావేక్షిస్తున్న పోలీసులు

## డ్రోన్ నిఘా

**ప్రజాశక్తి-తాడిమర్రి**

తాడిమర్రిలో నిర్వహించే ఇస్తేమాలో డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. ఆదివారం సిఐ శ్రీధర్, ఎస్ఐలు సోమశేఖర్, రాజశేఖర్, శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించారు. ఇస్తేమాకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని సిఐ శ్రీధర్ తెలిపారు.

## నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

ఈ నెల 20 నుంచి 31 తేదీ వరకూ మండలంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథరెడ్డి తెలిపారు. వారు ఆదివారం స్థానిక పశువైద్యశాలలో విలేకరులతో మాట్లాడారు. నేటి నుంచి పశువైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులు, గొర్రెలు, మేకలకు పరీక్షలు చేసి చికిత్స చేస్తారన్నారు. నట్టల నివారణ మందు తాపిస్తామన్నారు. 20న బత్తలపల్లి, గంటాపురం, ఈదుల ముష్టూరు, 21న పోట్లమర్రి, వేల్పుమడుగు. సంజీవపురం, 22న మాల్యవంతం, 23న తంబాపురం, 24న అప్పరాచెరువు, 26న సంగాల, 27న ఓబుళాపురం, 28న గరికలపల్లి, 29న దంపెట్ల, 30న డి.చెర్లోపల్లి, 31న నల్లబోయనపల్లి పంచాయతీల్లోనూ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

**గాండ్లపెంట :** నేటి నుంచి మండలంలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి బి.చెన్నకేశవనాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేస్తామని తెలిపారు.

## వంట గ్యాస్ అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

వంట గ్యాస్ ఏజెన్సీలు ప్రభుత్వ నిర్దేశించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని సిఎస్‌డిటి మోహన్‌నాయక్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గీతా నగర్, తదితర ప్రాంతాల్లో వినియోగదారుల ఇంటికి వెళ్లి ర్యాండమ్ సర్వే నిర్వహించామన్నారు. గ్యాస్ పంపిణీ, ధర, తదితర విషయాలపై ఆరా తీశామన్నారు. నిర్ణయించిన ధర కంటే అధిక ధర వసూలు చేస్తే సమాచారం ఇవ్వాలని వినియోగదారులకు సూచించారు. ఆయన వెంట వీఆర్‌ఏ నరేష్, గ్యాస్ ఏజెన్సీ ఉద్యోగులు ఉన్నారు.

సర్వే చేస్తున్న సిఎస్‌డిటి మోహన్‌నాయక్

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-కొత్త చెరువు రూరల్**

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, సిఎం చంద్రబాబు రైతు పక్షపాతి అని మరోసారి చాటారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మండలంలోని తలమర్లలో ఆమె మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. అలాగే తలమర్ల, ఇరగంపల్లి, కొడంగల్‌పల్లి, మరకుంటపల్లి గ్రామాలకు చెందిన 46 మంది రైతులకు పంట పిచికారి చేసే స్ప్రేయర్లు, టార్పాలిన్లు, గడ్డి కోసే యంత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతులకు ఎలాంటి వ్యవసాయ రాయితీ పథకాలు అందలేదని గుర్తుచేశారు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని పల్లె రఘునాథ్‌రెడ్డి అభివర్ణించారు. నియోజకవర్గంలో 300 మినీ గోకులాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్‌లో రైతులకు పంట పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, వలిపి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బాల కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, సామకోటి ఆదినారాయణ, చిన్నయ్య, శివ, మాధవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

యుటిఎఫ్ ధర్మవరం జోన్ శాఖ సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పిల్లలు మొత్తం 46 మంది విద్యార్థులకు పదో తరగతి మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ మోడల్ పేపర్ల ను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల శ్రేయస్సు కోసం ఏటా పదో తరగతి మోడల్ పేపర్లు రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జెవి.రమణ, యుటిఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు అమర్‌నారాయణరెడ్డి, వెంకట కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

# టిడిపి కార్యకర్తకు ఎంపీ పార్థసారధి పరామర్శ

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

మండలంలోని నల్లగొండ రాయనపల్లి గ్రామానికి చెందిన రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్.హరికృష్ణకు వైరల్ ఫీవర్ సోకడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలిసి ఆదివారం ఎంపి బికె.పార్థసారథి ఆ గ్రామం వెళ్లి హరికృష్ణను పరామర్శించారు. ఎంపి వెంట నాయకులు పెద్ద కిష్టప్ప, నరసింహులుయాదవ్, హెచ్.రామకృష్ణ, ఎం.గుట్టే గోవిందు, అశ్వర్థ, నాగమణి, బోరు గోపాల్, జెసిబి మారుతి, గోపాల్ యాదవ్, టిడి.బాబా, రాము, రామంజి, మైలార్‌యాదవ్, గొల్ల నరసింహులు, ఓబులేష్ యాదవ్, గుడ్డంపల్లి నరసింహులు, జి.వెంకటేశులు, కిష్టప్ప, చిన్ని కృష్ణప్ప, ఎస్.వెంకటేశులు, కె.శ్రీనివాసులు, ఎస్.విజయభాస్కర్, వెంకటేశులు ఉన్నారు.

హరికృష్ణను పరామర్శిస్తున్న ఎంపి బికె.పార్థసారధి

# వైసిపి పాలనలో మాలలకు అన్యాయం

## ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్

**ప్రజాశక్తి-మడకశిర**

గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వ విధ్వంస పాలన వల్ల మాలలు అభివృద్ధిలో మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లారని ఎస్సీ మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్ విమర్శించారు. పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో ఆదివారం విజయ్ కుమార్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంకరి కమలమ్మ, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ రాధమ్మ రాజు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ విదేశీ విద్యా నిధి పథకాన్ని జగనన్న విదేశీ విద్యా పథకంగా పేరు మార్చి అంబేద్కర్‌ను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీల అభ్యున్నతి కోసం ఉన్న 25 పథకాలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ముత్యాలు, మాల కమ్యూనిటీ తాలూకా అధ్యక్షుడు పాండురంగప్ప, కార్యదర్శి సోమ్ కుమార్, బసవరాజు, పూలకుంట మూర్తి, డాక్టర్ గడ్డం ముత్యాలప్ప, కోట్ల గంగాధర్ పాల్గొన్నారు .

# ఓబవ్వ ధీరత్వానికి ప్రతీకగా విగ్రహం ఏర్పాటు చేస్తాం

**ప్రజాశక్తి-గుడిబండ**

చిత్రదుర్గ కోట సామంతరాజుల రాజ్యాన్ని శత్రు సైన్యం నుంచి కాపాడేందుకు వీరోచిత పోరాటం చేసిన వీరవనిత ఓబవ్వ ధైర్యసాహసాలు కొనియాడదగినవి అని, ఓబవ్వ పోరాట పటిమ భావితరా లకు స్ఫూర్తిదాయకంగా ఉండేటా ఆమె విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. మండలంలోని మందలపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఓబవ్వ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ మంత్రి రఘువీరారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామస్తులు ఉరాలు మోగిస్తూ వారికి ఘన స్వాగతం పలికారు. రాజు, తిప్పేస్వామి కాసేపు ఉరాలు మోగించి కళాకారులను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు సైన్యాధ్యక్షుడు మాల వీర కన్నమదాసు, ఓబవ్వ వంటి పోరాట వీరుల చరిత్రను తెలియజేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓబవ్వ జయంతి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. డప్పు కళాకారుల తరహాలో ఉరాలు మోగించే మాల కళాకారులకు పింఛను ఇప్పించే విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి దళిత కాలనీలో సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే తాగునీరు, పాఠశాలలు, తదితర మౌలిక సదుపాయాలు అన్నీ అందుబాటులో ఉండేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయ కుమార్, డైరెక్టర్ కమలమ్మ, మాల తాలూకా అధ్యక్షులు పాండు రంగప్ప, బసవరాజు, బుడ్డన్నగారి సోము, టిడిపి మండలాల కన్వీనర్లు మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, లక్ష్మీనారాయణ, గణేష్ పాల్గొన్నారు.

## జయంతి సభలో ఎమ్మెల్యే రాజు

ఓబవ్వ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

శ్రీగోదా రంగనాయకులస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

## పాండురంగస్వామి ఆలయంలో కల్యాణోత్సవం

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పట్టణంలోని పిఆర్‌టి వీధిలో వెలసిన శ్రీపాండురంగస్వామి ఆలయంలో ఆదివారం శ్రీగోదా రంగనాయకులస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఈవో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గోదా రంగ నాయకుల కళ్యాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ 32వ వార్షికోత్సవం సందర్భంగా దాతల సహాయ సహకారాలతో అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కళ్యాణ వేడుక నిర్వహించామన్నారు. పరిసే మునెయ్య భజన మండలి వారు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం దాదాపు వెయ్యి మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

అంత్యక్రియలకు సాయం చేస్తున్న సంధా రాఘవ

## అంత్యక్రియలకు రాఘవ ఆర్థికసాయం

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన శ్రీరాములు ఆదివారం మృతి చెందాడు. ఆయన భార్య ప్రస్తుతం అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. వారికి సంతానం లేరు. ఈ విషయాన్ని పట్టణంలోని తారక్ చేయూత ట్రస్ట్ అధ్యక్షులు రామాంజి సంధా రాఘవ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాఘవ వెంటనే తారక్ చేయూత ట్రస్ట్ సభ్యుల ద్వారా శ్రీరాములు అంత్యక్రియల కోసం రూ. 6వేలను ఆయన కుటుంబ సభ్యులకు అందజేసి దాతృత్వం చాటుకున్నారు.

## అనారోగ్యంతో అంగన్వాడీ ఆయా మృతి

**ప్రజాశక్తి-రొద్దం**

మండలంలోని గోనిమేకలపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ-1 కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న రామలక్ష్మమ్మ(45) రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. పలుచోట్ల చికిత్స చేయించినా కూడా నయం కాకపోవడంతో కొన్ని రోజులుగా అనంతపురంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందింది. ఆమె మృతికి ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ ప్రగాఢ సంతాపం తెలిపారు.



రామలక్ష్మమ్మ(ఫైల్‌ఫొటో)

## గురునానక్, గురుగోవింద్ సింగ్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి-హిందూపురం**

సిక్కు గురువులు గురునానక్, గురుగోవింద్ సింగ్ జయంతోత్సవాలను కుల మతాలకు అతీతంగా ఆదివారం సిక్కుల ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు అందరికి పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రామచంద్రా రెడ్డి, ఎపిపి ఇందాద్, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, ఉదయ్ కుమార్, మింటూ మనోజ్, సిక్కు సంఘం నాయకులు పల్వీందర్ సింగ్. ఓంకార్ సింగ్. భగవాన్ సింగ్. నాందారీ సీడ్స్ షేక్ షబ్బీర్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న సిక్కులు

# సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

## వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

**ప్రజాశక్తి-రొద్దం**

ప్రజా సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. మండలంలోని తురకలాపట్నం గ్రామంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకే మంచుకురుస్తున్న సమయంలో ఆమె 'కాఫీ విత్ వైసిపి లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గుడ్ మార్నింగ్ అంటూ ప్రజలతో మమేకమై కాఫీ తాగారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. వైసిపి అధినేతపై మంత్రి సవిత చేసిన వ్యంగ్యాస్త్రాలను తిప్పి కొడుతూ జగన్‌ను విమర్శించే అర్హత నీకు లేదన్నారు. ఇకపై జగన్‌పై విమర్శలు చేస్తే వైసిపి ఊరికే ఉండదని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మండల కన్వీనర్లు తిమ్మయ్య, సుధాకర్‌రెడ్డి, నాయకులు అక్కులప్ప, నరేంద్రరెడ్డి, కంబాలప్ప, ఎన్. నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి, చిన్నమంతూరు రామిరెడ్డి, రవి, ధనుంజయ్యరెడ్డి, రాము, నరసింహులు, శ్రీహరి, తిమ్మిరెడ్డి, శేఖర్ ఉన్నారు.

వైసిపి శ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న ఉషశ్రీచరణ్

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న బత్తలపల్లి మండల నాయకులు

# కార్యకర్తలకు అండగా ఉంటా : కేతిరెడ్డి

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

వైసిపి శ్రేణులకు ఎప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల వైసిపి నాయకులు కేతిరెడ్డిని ధర్మవరం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కోటి సురేష్‌కుమార్‌కు జిల్లా స్థాయిలో, జయరామిరెడ్డిని తిరిగి మండల కన్వీనర్‌గా నియమించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కేతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, కూటమి నాయకులు చేస్తున్న దౌర్జన్యాంపై పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటీసీ కోటి నరేష్‌కూమార్, ఈడిగ కాశప్ప, యోగానందాచారి, నారాయణ, రాంభూపాల్‌రెడ్డి, పెదయ్య, సాకే సురేష్, శంకరయ్య పాల్గొన్నారు.

**కేతిరెడ్డిని కలిసిన పార్టీ శ్రేణులు**

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గజ్జల శివ, పెద్దన్న, నాయకులు తిమ్మన్న, రమేష్, దాసరి శ్రీనివాసులు, పెద్దిరెడ్డిగారి శ్రీనివాసులు, సాగ శ్రీనివాసులు, తిరుపాలు, నాగభూషణం, రామలింగ, రవి, చందు, శివ, జ్యోతి, మల్లికార్జున, ఓంప్రకాష్, కుమార్, హరీష్ పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం ధర్మవరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కమిటీని ముఖ్యఅతిథి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అసోసి యేషన్ అధ్యక్షుడిగా అంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్, కోశాధికారిగా రవి, కార్యదర్శిగా మనోహర్ తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మెడికల్ ల్యాబ్ టెక్నీషి యన్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

ఎన్నికైన ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కమిటీ

# గుండె వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

అనంతపురంలోని మార్క్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి డాక్టర్ ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి డాక్టర్ మదన్‌కుమార్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి మార్క్ హాస్పిటల్‌లో ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ పథకం కింద మెరుగైన చికిత్స అందిస్తారన్నారు. డాక్టర్ ప్లస్ ఫార్మసి ప్యారిని అభినందించారు. శిబిరంలో క్లబ్ సభ్యులు పచ్చిపులుసు రాఘవ, కిషోర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రంజిత్, తాహిర్ వలి,గణేష్, అభినయ్, రాఘవ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

# రచనలతో మూఢనమ్మకాలను రూపు మాపిన వ్యక్తి వేమన

**ప్రజాశక్తి-హిందూపురం**

ఆధునిక సమాజంలో విలువలతో కూడిన సమాజం నిర్మించడానికి, తన రచనలతో మూడనమ్మకాలను రూపు మాపడానికి యెగి వేమన కృషి అభినందనీయమని రెడ్డి సంఘం నాయకులు శుక్రవారం యెగి వేమన జయంతిని పురష్కరించుకుని రెడ్డి జెఎసి, స్వామి ప్రభోదనంద స్వామి శిశ్యులు, రూరల్ మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. రూరల్ మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాచపల్లి, చలివెందుల గ్రామాలలో ఘనంగా వేమన జయంతి వేడులకను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు వేణురెడ్డి, సత్య సాయి జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నాగభూషణ రెడ్డి, శివవంకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమాల్లో వేణుగోపాల్ రెడ్డి, చలివెందుల సర్పంచ్ ఉపేంద్ర రెడ్డి, బాలంపల్లి సర్పంచి అశ్వర్థనారాయణ రెడ్డి, లేపాక్షి జెడ్పిటిసి బాణాల శ్రీనివాస రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు వెంకటరామి రెడ్డి, కొండూరు బ్రహ్మానంద రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వర రెడ్డి, కోటిపి బసి రెడ్డి, కోటిపి హనుమంత రెడ్డి, శ్రీనివాస రెడ్డి, చిన్నా రెడ్డి, రెడ్డి సోదరులు పాల్గొన్నారు.



వేమన విగ్రహాన్ని ఊరేగిస్తున్న రెడ్డి సామాజిక వర్గం ప్రజలు